క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి రమ్య

మునగపాక: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి కేఎల్‌వీ రమ్య కోరారు. వాడ్రాపల్లి గ్రామంలో గురువారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్త నిర్వహణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికలపై రోజురోజుకూ లైగింక వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. తల్లితండ్రులు కూడా తమ పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. బాలల అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని కోరారు. బాలింతలు, గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలన్నారు.

'కాలనీలో క్రీడా మైదానం ఏర్పాటు చేయొద్దు'



ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఇందిరమ్మ కాలనీ వాసులు

మునగపాక: తమ కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయొద్దంటూ మునగపాక ఇందిరమ్మ కాలనీ వాసులు గురువారం మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తమ కాలనీలో 516 మంది పేదలకు పట్టాలు అందజేయగా.. ఇంతవరకు 425 మంది ఇంటి నిర్మాణాలు చేపట్టారని కాలనీ వాసులు శివ, మధు, సూరప్పారావు తదితరులు తెలిపారు. వివాహ, శుభ కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువుగా ఉన్న ఈ స్థలాన్ని ఇతర అవసరాల కోసం కేటాయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వీరునాయుడు, రామకృష్ణ, శ్రీనివాసరావు, రమణ, పూర్ణ, మణి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడి అభివృద్ధికి విరాళం

మునగపాక: మూలపేటలోని గంగాలమ్మ తల్లి గుడి అభివృద్ధికి దాతలు తమ వంతు సాయం అందజేస్తున్నారు. అనకాపల్లికి చెందిన గుడిపాటి వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం కుమారులు వెంకట శ్రీనివాస్ కుమార్, వెంకట రాజేంద్ర కుమార్ గురువారం రూ.51 వేల నగదును విరాళంగా సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కోటవురట్ల: కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో శ్రీసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద వినాయక నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అన్నసమారాధన నిర్వహించగా సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

సమరయోధుల జీవితాలు ఆదర్శనీయం



గ్రంథాలయానికి బహూకరించిన స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర పటాలు

యలమంచిలి రూరల్: దేశ స్వాతంత్య్రం కోసం నిస్వార్థంగా పోరాడి, జీవితాలను త్యాగం చేసిన మహనీయులను నేటి తరం విద్యార్థులు, యువకులు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని యలమంచిలి పౌర సేవా సంఘం ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. గురువారం యలమంచిలి శాఖ గ్రంథాలయానికి జాతీయ నాయకులు, స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర పటాలను వారు బహూకరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, విద్యార్థులకు కనిపించేలా, స్వాతంత్య్ర సమరయోధుల పేర్లతో ఉన్న ఫొటోలను ఉంచడం ద్వారా ఆ మహనీయులందర్నీ ఈ తరం ప్రజలు గుర్తు చేసుకుంటారని అభిప్రాయపడ్డారు. యువకుల్లో దేశ భక్తి పెంపొందించడానికి ఇలాంటివి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.ఆనంద్, పుల్లా వెంకట్రావు మాస్టారు, గదుల సత్యనారాయణ, యలమంచిలి అప్పారావు, గౌరపల్లి నరసింహ కాళిదాసు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీల కొరత.. రైతుల కలత

- ఇంకా కొనసాగుతున్న వరినాట్లు
- పెట్టుబడులు పెరుగుతాయని రైతుల ఆవేదన
- స్థానికులు బ్రాండిక్స్‌లో విధులకు వెళ్లిపోతున్న వైనం



తిమ్మరాజుపేటలో వరి ఉడుపులు



మునగపాకలో దమ్ము చేసిన పొలం

మునగపాక: మండలంలో ఖరీఫ్ వరి సాగు చేసే రైతులను కూలీల కొరత వేధిస్తోంది. వరుణుడు కరుణించడంతో ఊపందుకున్న వరినాట్లు పనులకు కూలీల సమస్యతో అంతరాయం కలుగుతోంది. తప్పనిసరి పరిస్థితిలో వరినాట్లు వేసేందుకు రైతులు అధిక కూలీ చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా వరి సాగుకు పెట్టుబడులు కూడా పెరిగిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు చోట్ల ఉడుపులు కూడా పూర్తి చేశారు. అయితే కొన్ని చోట్ల కూలీల సమస్య కారణంగా ఉడుపులు జరగడం లేదు. దీంతో దమ్ముల స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి.

బ్రాండిక్స్‌కు తరలడంతో సమస్య

కష్టపడి కుటుంబమంతా వరి సాగు చేపట్టినా ఆశించిన మేర దిగుబడులు రాక, ఆదాయం అంతంత మాత్రంగా ఉండడంతో రైతులు వ్యవసాయం కన్నా కంపెనీలకు పోయి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మెజార్టీ రైతులు అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ కంపెనీకి తరలిపోవడంతో సమస్య ఎదురవుతుందంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉన్నపాటి భూమిలో వరి సాగు చేపడుతూ వస్తున్నారు. నెలకు రూ.12వేల నుంచి 15వేల మేర ఆదాయం వస్తుండడంతో కంపెనీకి వెళ్లేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

గిట్టుబాటు ధర అవసరం

వరికి ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధరలు కల్పించాల్సి ఉంది. ఖర్చుతో పోలిస్తే ప్రభుత్వం ఇచ్చే గిట్టుబాటు ధర ఎటూ చాలడం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి విషయంలో గిట్టుబాటు ధరలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

1225 హెక్టార్లలో వరి సాగు

ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా వరి సాగు 1456 హెక్టార్లు. ఇంత వరకు 1225 హెక్టార్లకు పైగా వరి సాగు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే వరి నాట్లు పూర్తి కావాల్సి ఉన్నా కూలీల సమస్య కారణంగా పలు చోట్ల నాట్లు ఆలస్యమయ్యాయి. ఈ నెల 15వ తేదీలోగా లక్ష్యాన్ని చేరుకోగలమని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న సాగు ఖర్చులు

ప్రతి ఏటా వరి సాగుకు పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఎకరా విస్తీర్ణంలో వరి సాగుకు సుమారు రూ.51వేలకు పైగా ఖర్చు అవుతుంది. విత్తనానికి రూ.1000, దమ్ములకు రూ.5వేలు, ఉడుపులకు రూ.7500, వరిలో కలుపు నివారణకు రూ.8వేలు, కోతల సమయంలో రూ.6వేలు, వరి కుప్పల సమయంలో రూ.3వేలు, నూర్పులకు రూ.6వేలు వెరసి సుమారు రూ.51వేల వరకు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఎటువంటి వైపరీత్యాలు లేకుంటే ఎకరాకు 30 క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం క్వింటాళ్లకు రూ.2వేల వరకు ధర పలుకుతుంది. ఈ లెక్కన రూ.60 వేల వరకు ఆదాయం వస్తుంది. ఖర్చుతో పోలిస్తే రూ.9వేల వరకు ఆదాయం మిగులుతుంది. కుటుంబ మంతా కలిసి ఐదు నెలలు కష్టపడి పనిచేస్తే రైతుకు మిగిలేది అరకొర ఆదాయమంటూ ఆవేదన చెందుతున్నారు.

ఈ ఏడాది కూలీల సమస్య ఎదురైంది



మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది కూలీలు సమస్య ఎక్కువైంది. వరి సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో గ్రామాల్లో కూలీలు దొరక లేదు. దీంతో వరి నాట్లు ఆలస్యమయ్యాయి. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ కూలీలు అందుబాటులో లేక ఇబ్బందులు తప్పడం లేదు.

–నరాలశెట్టి సూర్యనారాయణ, రైతు, ఒంపోలు

గిట్టుబాటు ధర కల్పించాలి



వరికి గిట్టుబాటు ధర కల్పించాలి. వరి సాగుకు ఏటా ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఆదాయం అంతంతమాత్రంగానే కనిపిస్తుంది. ఇంటిల్లి పాది కష్టపడి పనిచేసినా వరికి ఖర్చు ఎక్కువగా కనిపిస్తుంది. వాతావరణం అనుకూలం లేకపోవడంతో రైతుకు ఇబ్బందులు తప్పవు, రోజురోజుకూ కూలీల ఖర్చు కూడా పెరిగిపోవడం మరో వైపు దిగుబడులు కూడా ఆశించినంత ఉండడం లేదు.

– మళ్ల జోగినాయుడు, రైతు, వాడ్రాపల్లి

గ్రామాల్లో యూరియా కొరత రానీయొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: గ్రామాల్లో ప్రతి రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. రైతులకు అవసరమైన యూరియా పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, వీఏఏలు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మండల ప్రత్యేకాధికారి రహీమ్, మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఏఎస్ఐ దొర, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్లపై దృష్టి సారించాలి

మునగపాక: నీటి తీరువా వసూళ్లపై దృష్టి సారించాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. గురువారం ఆయన వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ఎంత మేర ప్రభుత్వ భూములు ఉన్నాయనే వివరాలు సేకరించాలన్నారు. రోజుకు ప్రతి వీఆర్వో రూ. 3వేలకు పైగా నీటి తీరువా వసూళ్లు జరిగేలా చూడాలన్నారు. రైతులకు అవగాహన కల్పిస్తూ నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలన్నారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి



తంగేడులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

కోటవురట్ల: పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి సూచించారు. ఐవీఆర్ఎస్ గ్రామం తంగేడును ఆయన గురువారం సందర్శించారు. గ్రామంలోని వీధుల్లో పర్యటించి పారిశుధ్య అంశాలు పరిశీలించారు. డ్రైనేజీలు పరిశీలించి పూడిక తీయించారు. మంచినీటి పథకాల క్లోరినేషన్‌పై ఆరా తీశారు. మంచినీటి నమూనా సేకరించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపించారు. ఇంటింటికి వెళ్లి పారిశుధ్య సేకరణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని స్థానికులకు సూచించారు. అనంతరం గ్రామం శివారున ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి నిర్వహణపై ఎంపీడీవో చంద్రశేఖర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో పోలవరం నీటి సరఫరాకు చర్యలు

రైతులకు హామీ ఇచ్చిన ఇరిగేషన్ అధికారులు



జోడిమెట్ట వద్ద పోలవరం కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు, నాయకులు

నక్కపల్లి: మండలంలో పోలవరం కాలువకు దిగువన ఉన్న పొలాలకు ఖరీఫ్ సీజన్‌లో పోలవరం కాలువలో నీటిని ఉపయోగించుకునేందుకు ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. పోలవరం కాలువలో చేరిన నీరు దిగువ ప్రాంతాలకు రాకుండా గట్టు వేయడంతో ఖరీఫ్‌లో పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొందంటూ చినరామభద్రపురం, దేవవరం, ఒడ్డిమెట్ట గ్రామాల రైతులు స్థానిక నాయకులు వీసం రామకృష్ణ, ఇందుకూరి రవిరాజు, వేగేశ్న చంటి, దండు బలరామరాజులకు మొరపెట్టుకున్న సంగతి తెలిసిందే. వీరు ఈ సమస్యను పరిష్కరించాలని ఇరిగేషన్ అధికారులు, పోలవరం కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇరిగేషన్ అధికారులు గురువారం చినరామభద్రపురం సమీపంలో ఉన్న జోడి మెట్ట వద్ద నాయకులు, రైతులతో కలసి కాలువ నుంచి దిగువ ప్రాంతాలకు నీరు విడుదలయ్యే మార్గాలను పరిశీలించారు. గట్లను తవ్వి శాశ్వతంగా నీటిని విడుదల చేసే అవకాశాలు ఇప్పట్లో ఉండవని, అయితే వర్షపు నీరు, గెడ్డల ద్వారా వచ్చే నీటిపై ఆధారపడి ఈ గ్రామాల పరిధిలో 3వేల ఎకరాలు సాగు చేస్తున్న విషయం నాయకులు తమ దృష్టికి తీసుకు రావడంతో ఉన్నతాధికారులకు ఈ సమస్య వివరించడంతో పాటు, వరి పొలాలకు నీరు అందివ్వాలనే ఉద్దేశంతో ఖరీఫ్ సీజన్ వరకు పోలవరం కాలువలో చేరిన నీటిని తాత్కాలిక మార్గాలు ఏర్పాటు చేసి సాగు కోసం ఉపయోగించుకునే వెసులుబాటు కల్పిస్తామని ఇరిగేషన్ అధికారులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె నర్సింహమూర్తి, రైతులు పైలా నూకన్న నాయుడు, సఖిరెడ్డి వెంకటరమణ, సీతంపాలెం ఎంపీటీసీ గొర్లె గోవిందు, చినరామభద్రపురం, దేవవరం, ఒడ్డిమెట్ట రైతులు పాల్గొన్నారు.

ఖబర్‌స్థాన్ అభివృద్ధికి వితరణ



సాయం అందిస్తున్న తారా మసీదు కమిటీ సభ్యులు

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీకి చెందిన ఖబర్‌స్థాన్ అభివృద్ధికి విశాఖలో మద్దిలపాలేనికి చెందిన తారా మసీదు కమిటీ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు విశాఖలోని తారా మసీదు కార్యాలయంలో కమిటీ సభ్యులు స్థానిక మసీదు ఉస్మాన్ ఘని కమిటీ సభ్యులకు రూ.13,200 నగదు అందజేశారు. ఈ నిధులతో ఖబర్‌స్థాన్ ప్రహరీ నిర్మించనున్నట్టు ఉస్మాన్ ఘని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా తారా మసీదు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్ ఘని ప్రతినిధులు మహమ్మద్ గౌస్ లాజం, ఖుదా భాషా, తారా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ఎం రజాక్, సెక్రటరీ మదీనా, బాబ్జీమస్తాన్, చోటా, నవజవాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పరిశీలన



తిమ్మాపురంలో చెత్త సేకరణ తీరును పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ సూచించారు. తిమ్మాపురం, గుర్రాజుపేట, రేవుపోలవరం, బంగారమ్మపాలెం, వెంకటాపురం, ఉప్పరాపల్లి, గుడివాడ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. గుర్రాజుపేట, గుడివాడ, రేవుపోలవరం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్వహణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి,పొడి విభజించి ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. సిబ్బంది లేని గ్రామాల్లో కొత్తగా నియమించి చెత్త నుంచి సంపద తయారు చేసే కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు.

ఉపాధ్యాయులకు అంకిత భావం అవసరం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ



బోదిగల్లం పాఠశాలలో సర్వేపల్లి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక: ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. మునగపాక మండల పరిషత్ హాలులో గురువారం సాయంత్రం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. పిల్లల సంఖ్యను పెంచుతూ విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎంఈవో బుద్ద శివనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఉపాధ్యాయులు పెంటకోట సత్యనారాయణ, ఎంవై రాము తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బోదిగల్లం పాఠశాలలో..

నక్కపల్లి: మండలంలో పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్ఎం జయశ్రీ, సాంఘిక ఉపాధ్యాయిని ఏవీఎస్ కుమారిలను విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫల్గుణరావు, పద్మావతి, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో..

పాయకరావుపేట: శ్రీప్రకాష్ విద్యా సంస్థలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురుదేవుళ్లను ఘనంగా సన్మానించారు. మెరుగైన అభ్యాసం కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం అనే అంశంపై చర్చా వేదిక, ఆటల పోటీలు, నృత్య, నాటక, బృందగాన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విజయ్‌ప్రకాష్



ధర్మవరం అగ్రహారంలో కుర్చీల ఆట ఆడుతున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: టీచర్స్‌డేను పురస్కరించుకుని ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయంగా గ్రీటింగ్స్ తయారు చేసి ఉపాధ్యాయులకు అందజేశారు. శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. ధర్మవరం అగ్రహారంలో ఉపాధ్యాయులు పలు క్రీడా పోటీల్లో పాల్గొని సందడి చేశారు.

మృతుడి కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న వైస్ ఎంపీపీ వీసం నానాజీ

నక్కపల్లి: స్థానిక శెట్టి బలిజపేటలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లైటింగ్ పనులు చేస్తూ విద్యుత్ షాక్‌కు గురై మరణించిన వ్యక్తి కుటుంబానికి నిర్వాహకులు సాయం అందజేశారు. వినాయక మండపం వద్ద గత నెల 27న కాగితకు చెందిన ఎలక్ట్రీషియన్ విజయ్‌కుమార్ మరణించిన విషయం తెలిసిందే. ఇతని ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న నిర్వాహకులు రూ.60 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని గురువారం వైస్ ఎంపీపీ వీసం నానాజీ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

వాడవాడలా గణనాథునికి పూజలు



నెహ్రూనగర్‌లో గణనాథుడిని దర్శించుకున్న కరణం ధర్మశ్రీ, నాయకులు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, మండలంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన గణనాథునికి పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు విగ్రహాలను నిమజ్జనం చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ నాయకులు గురువారం రాత్రి యలమంచిలి పట్టణంలోని నెహ్రూనగర్ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన బాల గణపతిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ ఛైర్మన్ అర్రెపు గుప్తా, కోఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి, వార్డు కౌన్సిలర్లు ఈరిగిల గణేష్, గొంపాని శివ, ఈరిగిల చంటి, ఈశ్వర్రావు, తెరపల్లి నర్సింగరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట: మండలంలో పీఏసీఎస్‌లు, ఆర్ఎస్‌కేల్లో ఉన్న ఎరువులను గురువారం అధికారులు తనిఖీ చేశారు. మండల ప్రత్యేకాధికారి జయప్రకాష్ లోక్‌నాయక్ ఆధ్వర్యంలో ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయశాఖల సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. అవసరమైన మేరకు ఎరువులు సరఫరా చేయాలన్నారు. లైసెన్స్ ఎరువుల దుకాణాలను కూడా తనిఖీ చేసి కొరత లేకుండా చూడాలని డీలర్లను ఆదేశించారు.

డీఎస్సీలో సత్తా చాటిన దళిత అభ్యర్థులకు సత్కారం



ఎంపికైన టీచర్లను సన్మానిస్తున్న దళిత్ సభ్యులు

ఎస్.రాయవరం: ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని ఐదుగురు దళిత అభ్యర్థులను సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో అడ్డురోడ్డులో గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమతా దళ్ అధ్యక్షుడు గారా ప్రకాష్, కార్యదర్శి విజయ్‌కుమార్, గౌరవ సభ్యులు జి.నారాయణరావు, కాకర అప్పారావు, కె.గోపాలకృష్ణ, సురేష్, ఐ.రాజు, ఈరిగిల అప్పారావు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేతిబోరుకు మరమ్మతులు

కోటవురట్ల: కె.వెంకటాపురం ఎస్సీ కాలనీలో చేతిబోరుకు గురువారం మరమ్మతులు చేపట్టారు. ఇక్కడి చేతిబోరు పాడవ్వడంతో స్థానికులు సర్పంచ్ భవానీ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆమె చర్యలు చేపట్టి మరమ్మతులు చేయించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనోత్సవాలు



రామన్నపాలెంలో లడ్డూ ప్రసాదాన్ని వేలంలో పాడుకున్న ధర్మిరెడ్డి నాయుడుబాబు కుటుంబ సభ్యులు

అచ్యుతాపురం రూరల్: మండలంలో వినాయకుడి నిమజ్జనోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు అన్నసంతర్పణలు జరిపారు. అచ్యుతాపురం సమీప రామన్నపాలెంలోని బాల గణపతి మండపంలో లడ్డూ వేలం వేయగా అదే గ్రామానికి చెందిన ధర్మిరెడ్డి నాయుడు బాబు కుటుంబ సభ్యులు రూ.20వేలకు పాడుకున్నారు. అనంతరం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వినాయక నిమజ్జనోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, ఎంపీటీసీ లాలం శ్రీను, ధర్మిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, డాక్టర్ వెంకట్, లాలం సత్తిబాబు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

మునగపాక: వెంకటాపురంలో గురువారం రాత్రి వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ముందుగా గణనాథుడిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.